సాక్షి
వికారాబాద్
మంగళవారం । 16 । జూలై । 2024



కౌలు వేలం మళ్లీ వాయిదా

దోమ మండలం దొంగ ఎన్కేపల్లిలోని శ్రీ సంజీవస్వామి ఆలయ భూముల కౌలు వేలం మరోమారు వాయిదా పడింది. 8లో▸



జీవాలు జాగ్రత్త

పశువులకు వ్యాపించే సీజనల్ వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యులు సూచిస్తున్నారు. 8లో▸



సర్కారు బడుల మూత

దుద్యాల మండలంలోని పలు తండాల్లో ఉపాధ్యాయులు లేక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు మూతపడుతున్నాయి. 9లో▸

న్యూస్‌రీల్

ప్రజావాణికి 84 అర్జీలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. విద్య, వైద్యం, బీసీ, గిరిజన సంక్షేమం, విద్యుత్, పంచాయతీరాజ్, పింఛన్లు, మున్సిపాలిటీ, ధరణి, మైన్స్, భూసర్వే తదితర అంశాలకు సంబంధించి 84 అర్జీలు వచ్చాయి. వాటిని ఆయా శాఖల అధికారులకు బదిలీ చేశారు. ప్రజావాణి తోపాటు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సుధీర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, ఆర్డీఓ వాసుచంద్ర, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

కొడంగల్: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో ఈ నెల 17న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు లయన్స్ క్లబ్ సభ్యులు సోమవారం తెలిపారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. కంటి సమస్యలు ఉన్నవారు ఆధార్ కార్డుతో రావాలని సూచించారు. శస్త్రచికిత్సలు అవసరం ఉన్నవారికి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కందూరు రాంరెడ్డి కంటి ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేస్తామన్నారు. కలెక్టర్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, వైద్య ఆరోగ్య శాఖ, లయన్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరం జరుగుతుందని ఆప్తాల్మిక్ అధికారి లయన్ హరినాథ్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మురహరి వశిష్ఠ తెలిపారు.

ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే యాదయ్య




నవాబుపేట: చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య సోమవారం వికారాబాద్‌లో ఎస్పీ నారాయణ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువా కప్పి సత్కరించారు. జిల్లాలో శాంతిభద్రతలను పరిరక్షించాలని కోరారు.

పంచాయతీరాజ్ ఈఈగా సత్యనారాయణరెడ్డి

తాండూరు రూరల్: పంచాయతీరాజ్ తాండూరు డివిజన్ ఈఈగా సత్యనారాయణరెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేసిన ఈఈ శ్రీరాములు సిద్దిపేట డివిజన్‌కు బదిలీపై వెళ్లారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న సత్యనారాయణరెడ్డి తాండూరుకు బదిలీపై వచ్చారు. ఆయన్ను డీఈలు వెంకట్రావు కృష్ణ జోషి, సుదర్శన్, జితేందర్, ఏఈఈ సంతోష్, సిద్ధార్థ, వంశీ, సురేందర్‌రెడ్డి స్వాగతం పలికి సన్మానించారు.

లీగ్ మ్యాచ్‌లకు చైత్రరెడ్డి ఎంపిక



పెద్దేముల్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే అండర్ -15 బాలికల విభాగం స్టేట్ లీగ్ మ్యాచ్‌లకు చైత్రరెడ్డి ఎంపికయ్యారు. పెద్దేముల్ మండలం గిర్మాపూర్‌కు చెందిన చైత్రారెడ్డి తాండూరు పట్టణంలోని మల్‌రెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. పట్టణంలోని లెజెండ్స్ క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందుతోంది. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ బాలిక విభాగం జట్టుకు చైత్రారెడ్డి ఎంపిక కావడంపై కోచ్‌లు సోహెల్, సాహిల్, పాఠశాల ఉపాధ్యాయులు అనురాధ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ధారాసింగ్, కాంగ్రెస్ పార్టీ తాండూరు నియోజకవర్గ ఏ- బ్లాక్ అధ్యక్షుడు నర్సింలు, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు నీలు అభినందించారు.

విస్తారంగా వర్షాలు



వికారాబాద్‌లో జలమయమైన రోడ్డు

24 గంటలుగా కురుస్తున్న వాన

- పంటలకు జీవం పోసిన వరుణుడు
- ఈ సీజన్‌లో ఇదే అత్యధిక వర్షపాతం
- పరిస్థితిపై కలెక్టర్, ఎస్పీ ఆరా
- అప్రమత్తంగా ఉండాలని సూచన

వికారాబాద్: జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. గడిచిన 24 గంటలుగా వానలు పడుతుండటంతో పంటలకు జీవం పోసినట్లయ్యింది. ఈ సీజన్ ప్రారంభమయ్యింది మొదలు ఇదే అత్యధిక వర్షపాతం. ఒకటి రెండు చోట్ల అతి భారీగా మిగతా చోట్ల భారీ వర్షం పడింది. ఆదివారం సాయంత్రం ప్రారంభమై సోమవారమంతా ముసురుతో కూడిన వర్షం కురిసింది. దీంతో రైతన్నకు కాస్త ఉపశమనం లభించింది. భారీ వర్షాలకు వాగులు పొంగి పొర్లుతున్నాయి. చెరువులు, కుంటల్లోకి నీరు చేరుతోంది. నవాబుపేటలో అత్యధికంగా 91.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. కోట్‌పల్లిలో 60.8మి.మీ., బంట్వారంలో 60.2మి.మీ., వికారాబాద్‌లో 56.6మి.మీటర్ల భారీ వర్షపాతం నమోదైంది. రెండు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా 824 మిల్లీ మీటర్ల వర్షపాతం కురిసింది.

రైతుల్లో ఆనందం

వానాకాలం ఆరంభం నుంచి ఇప్పటి వరకు పంటలకు సరిపడా వర్షం పడలేదు. అప్పుడప్పుడు వర్షం పడినా కొన్ని ప్రాంతాల్లో కురవలేదు. దీంతో చెలకలు, ఇసుక పొలాల్లో మొక్కజొన్న తదితర విత్తనాలు సగం మొలకెత్తగా మిగతావి ఎండిపోయాయి. వర్షాల కోసం రైతులు గ్రామ దేవతలకు పూజలు సైతం చేశారు. ప్రస్తుతం వరి నాట్ల సీజన్ కావడం వర్షాలు పడుతుండటంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. బోరు బావులు, చెరువుల్లో నీరు చేరడంతో వరి నాట్లు వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.

అప్రమత్తమైన అధికారులు

జిల్లాలో కురుస్తున్న వర్షాలతో నెలకొన్న పరిస్థితులను అధికారులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. గత అనుభవాల నేపథ్యంలో అటు రెవెన్యూ, ఇటు పోలీసు యంత్రాంగం కూడా అప్రమత్తమైంది. గతంలో పలు సార్లు వరదల కారణంగా మూగజీవాలు చనిపోయిన నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశించారు.

జిల్లాలో గడచిన 24 గంటల్లో నమోదైన వర్షపాతం

మండలం		మిల్లీ మీటర్లలో..
మర్పల్లి	–	26.6
మోమిన్‌పేట	–	42.4
నవాబుపేట	–	91.2
వికారాబాద్	–	56.4
పూడూరు	–	47.4
పరిగి	–	28.6
కుల్కచర్ల	–	24.6
దోమ	–	35.2
బొంరాస్‌పేట	–	15.0
ధారూరు	–	59.0
కోట్‌పల్లి	–	60.8
బంట్వారం	–	60.2
పెద్దేముల్	–	34.2
తాండూరు	–	38.4
బషీరాబాద్	–	47.4
యాలాల	–	38.6
కొడంగల్	–	34.8
దౌల్తాబాద్	–	21.6
చౌడాపూర్	–	30.6
దుద్యాల	–	35.2

జిల్లాలో 26 చోట్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నట్టు గుర్తించిన అధికారులు నివారణకు చర్యలు చేపట్టారు. వానలు తగ్గే వరకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జిల్లాలో 1,179 చెరువులు, కుంటలు ప్రాజెక్టులు ఉండగా వాటిలోకి నీరు వస్తోంది. వికారాబాద్, తాండూరు, పరిగి పట్టణాల్లో లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపునీరు చేరింది. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ పల్వన్‌కుమార్

జేఈ వ్యాక్సినేషన్‌కు సిద్ధంకండి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ పల్వన్‌కుమార్
- టీకాపై వైద్య సిబ్బందికి శిక్షణ

అనంతగిరి: జిల్లాలో మెదడు వాపు వ్యాధి నివారణకు ఈ నెల 25నుంచి జేఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం ప్రారంభమవుతుందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పల్వన్‌కుమార్ తెలిపారు. సోమవారం వికారాబాద్‌లోని జిల్లా వైద్య శాఖ కార్యాలయ ఆవరణలో జిల్లాలోని పీహెచ్‌సీ వైద్యులు, పారామెడికల్ సిబ్బందికి జేఈ టీకాపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జేఈ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజ్‌గిరి, వికారాబాద్ జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టనున్నట్లు తెలిపారు. 6 నుంచి15 సంవత్సరాల వయసులోపు పిల్లలకు పాఠశాలల్లో, 9 నెలల నుంచి 5 సంవత్సరాలలోపు పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో టీకాలు వేస్తారని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వైద్యులు, పారామెడికల్ సిబ్బంది వారివారి పరిధిలోని పిల్లలను గుర్తించి టీకా వేసేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అనంతరం డబ్ల్యూహెచ్‌ఓ కన్సల్టెంట్ డాక్టర్ మురారి టీకా ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

ఇబ్రహీంపట్నం రూరల్: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ప్రభుత్వ పెన్షన్‌దారుల సంయుక్త కార్యాచరణ సమితి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట పెన్షనర్లు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడు నాలుగేళ్లుగా దీర్ఘకాలిక అపరిష్కృత సమస్యలను ప్రభుత్వానికి విన్నవిస్తూనే ఉన్నామని తెలిపారు. గత ప్రభుత్వం హయాంలో పలుమార్లు విజ్ఞప్తులు సమర్పించినా పట్టించుకోలేదన్నారు. కరువు భత్యం అందజేయాలని, ఈహెచ్‌ఎస్ పథకం సక్రమంగా అమలు చేయాలని, వెల్‌నెస్ సెంటర్లలో సరైన వసతులు కల్పించాలని, సకాలంలో మెడికల్ రీయింబర్స్‌మెంట్ అందజేయాలని, స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు, పెన్షనర్లకు డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలని కోరారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న పెన్షనర్లకు ప్రత్యేక ఇన్సెంటివ్ అందజేయాలన్నారు. కార్యక్రమంలో చైర్మన్ లక్ష్మయ్య, జనరల్ సెక్రెటరీ శుభాకర్‌రావు, కేపీ రమణాచారి, పూర్ణచందర్‌రావు, సుధాకర్, కృష్ణాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రూ.5 వేల కోట్లతో గ్రీన్ ఫీల్డ్ హైవే

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

షాద్‌నగర్: హైదరాబాద్ – బెంగళూరు జాతీయ రహదారిని రూ.5వేల కోట్ల గ్రీన్ ఫీల్డ్ హైవేగా నిర్మించేందుకు ప్రతిపాదనలు రూపొందించినట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల సందర్భంగా సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గానికి వెళ్లిన మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావుకు షాద్‌నగర్‌లోని బైపాస్‌లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. హైదరాబాద్ – బెంగళూరు జాతీయ రహదారిపై వాహనాల రద్దీ పెరిగిపోవడంతో ఈ రహదారిని రూ.5వేల కోట్ల గ్రీన్ ఫీల్డ్ హైవేగా నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఈ విషయమై కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో చర్చించినట్లు తెలిపారు. మొదటగా హైదరాబాద్ నుంచి కర్నూల్ వరకు ఉన్న రహదారిని విస్తరించనున్నట్లు వెల్లడించారు. గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం పూర్తయితే వాహనదారులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని, రవాణా వ్యవస్థ మరింత బాగుపడుతుందన్నారు. షాద్‌నగర్ పట్టణంలో చటాన్‌పల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జిని నిర్మాణానికి గతంలో రూ.90కోట్లు మాత్రమే కేటాయించగా ప్రస్తుతం రూ.180 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు 15 రోజుల్లో ప్రారంభం అవుతాయన్నారు. 44వ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా తొండుపల్లిలో నెలకొన్న సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

కులగణన చేసి రిజర్వేషన్లు పెంచాలి



స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీసీ ఫ్రంట్ నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: బీసీ కులగణన చేసి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచాలని తెలంగాణ రాష్ట్ర బీసీ ఫ్రంట్ చైర్మన్ గొరిగె మల్లేష్ యాదవ్ కోరారు. ఈ మేరకు సోమవారం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానం ప్రకారం సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, వార్డు సభ్యుల్లో బీసీ రిజర్వేషన్లు 20 నుంచి 42 శాతానికి పెంచాలన్నారు. బీసీ జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. కులగణన మొదలు పెట్టాలన్నారు. రాహుల్‌గాంధీ దేశంలో పర్యటిస్తున్న సందర్భంలో కూడా ఇదే హామీ ఇచ్చారని గుర్తు చేశారు. బీసీల జెండా ఎత్తుకొని మోసం చేయాలని చూస్తే ఊరుకోబోమని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 45 శాతం రిజర్వేషన్లు అమలు చేశారని చెప్పారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు కృష్ణ, నందగోపాల్, రామకృష్ణ, వంశీకృష్ణ, సతీష్, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.



కల్వర్టు కోసం తవ్విన గుంతలో నిలిచిన వర్షపు నీరు



కల్వర్టు వద్ద జరిగిన ప్రమాదం(ఫైల్)

పనులు సాగక.. వెతలు తీరక

నత్తనడకన మహబూబ్‌నగర్ - చించోలి జాతీయ రహదారి నిర్మాణం

- కల్వర్టు కోసం భారీ తవ్వకాలు
- వర్షాలకు కనిపించని గుంతలు
- ప్రమాదాల బారిన ద్విచక్ర వాహనదారులు

కొడంగల్: మహబూబ్‌నగర్ – చించోలి జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. మహబూబ్‌నగర్ నుంచి వికారాబాద్ జిల్లా దుద్యాల గేటు వరకు ఒక బిట్టు, దుద్యాల గేటు నుంచి కర్ణాటక సరిహద్దు వరకు మరో బిట్టుగా పనిని విభజించి కాంట్రాక్టు ఇచ్చారు. విడతల వారీగా రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. మొదటి విడత పనులు దాదాపు చివరి దశకు చేరుకున్నాయి. రెండో విడత పనుల్లో జాప్యం జరుగుతోందని వాహనదారులు ఆరోపిస్తున్నారు. కల్వర్టుల కోసం భారీ గుంతలు తీశారు. ప్రమాదవశాత్తు ఈ గుంతల్లో ద్విచక్ర వాహనాలు దూసుకెళ్లి ప్రజలు గాయపడుతున్నారు. ప్రస్తుత వర్షాలకు నీరు చేరి గుంతలు కనిపించడం లేదు. జాతీయ రహదారి నిర్మాణంలో వేగం పంచాలని స్థానికులు కోరుతున్నారు. ఏళ్లు గడుస్తున్నా పనులు పూర్తి కాకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు.



వాహనం పైనుంచి పడిన వృద్ధురాలు(ఫైల్)

రూ.630 కోట్లు మంజూరు

మహబూబ్‌నగర్ – చించోలీ అంతర్రాష్ట్ర రహదారిని కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారిగా మార్చిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించిన పనుల కోసం రూ.630 కోట్లు మంజూరు చేసింది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం నుంచి కర్ణాటక రాష్ట్రం చించోలి వరకు జాతీయ రహదారి నిర్మిస్తారు. ఈ రహదారికి 167ఎన్‌గా నామకరణం చేశారు. మహబూబ్‌నగర్, కోస్గి, కొడంగల్, తాండూరు మీదుగా చించోలి, మన్నాకెళ్లి వరకు రోడ్డు విస్తరణ జరుగుతుంది. నాలుగు లేన్ల రహదారి నిర్మిస్తారు. బెంగళూరు, ముంబై జాతీయ రహదారులను కలిపే ఈ లింక్ హైవే 150 కిలోమీటర్ల పొడవు ఉంది. వికారాబాద్ జిల్లాలో 45 కిలోమీటర్ల దూరం విస్తరించి ఉంది. కొడంగల్ పట్టణ శివారులో ఫ్లై ఓవరు నిర్మించడానికి ఆర్అండ్‌బీ అధికారులు సిద్ధమయ్యారు. ఈ మేరకు భూసేకరణకు ప్రకటన విడుదల చేశారు. డీపీఆర్‌లో సూచించిన అలైన్‌మెంట్ ప్రకారం కొడంగల్‌లో బైపాస్ నిర్మిస్తారు. నాలుగు కిలో మీటర్ల దూరం బైపాస్ ఉంటుంది. ఈ బైపాస్ మరో జాతీయ రహదారి అయిన బీజాపూర్ – హైదరాబాద్ జాతీయ రహదారిని క్రాస్ చేయాల్సి ఉంటుంది. ఈ రెండు జాతీయ రహదారులు కలిసే చోట రాకపోకలకు ఇబ్బంది ఉండకూడదనే ఉద్దేశంతో ఫ్లై ఓవర్‌తో పాటు సర్వీస్ రోడ్లు వేయాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. బైపాస్ భూ సేకరణ కోసం రూ.150 కోట్లు కేటాయించారు.

పరిహారం చెల్లించకుండా భూములు తీసుకోవద్దు

- తెలంగాణ పంచాయతీ రాజ్ చాంబర్ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి

సాక్షి,రంగారెడ్డిజిల్లా: పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ నిర్మిస్తున్న బీదర్–మహేశ్వరం 765 కేవీ పవర్ ట్రాన్స్‌మిషన్ లైన్‌లో భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ పంచాయతీ రాజ్ చాంబర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. సోమవారం ఆ చాంబర్ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్‌తో కలిసి అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. చేవెళ్ల, షాబాద్, కేశంపేట, కొందుర్గు, ఫరూఖ్‌నగర్, కడ్తాల్, కందుకూరు మండలాల మీదుగా (తెలంగాణలో 165 కిలోమీటర్ల దూరం లైన్) 765 కేవీ విద్యుత్ లైన్ పనులు చేపడుతున్నారని, ఒక్కో టవర్‌కు 12గుంటలు, లైన్ల కింద మరో 12 గుంటల చొప్పున మొత్తం 3వేల ఎకరాల భూమిని రైతులు కోల్పోవాల్సి వస్తోందని అన్నారు. ఆయాలైన్ల కింద ఇళ్లు, గోదాములు, ఇతర నిర్మాణాలు చేపట్టలేని పరిస్థితి ఉంటుందని తెలిపారు. అంతే కాదు కరెంట్ లైన్ల కారణంగా పక్కనే ఉన్న రైతు భూమితో పోలిస్తే..లైన్లు వేసిన రైతుల భూముల ధరలు కూడా భారీగా తగ్గే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. భూములు కోల్పోయిన రైతులకు బహిరంగ మార్కెట్ ధరలకు అనుగుణంగా నష్టపరిహారం చెల్లించాలని కోరారు. పరిహారం చెల్లించకుండా రైతుల నుంచి బలవంతంగా భూములను తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు.



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతలు

క్లుప్తంగా

నేడు స్పీకర్‌ పర్యటన

బంట్వారం: స్థానిక ఎమ్మెల్యే, అసెంబ్లీ స్పీకర్‌ గడ్డం ప్రసాద్‌కుమార్‌ మంగళవారం బంట్వారం విచ్చేయనున్నట్లు కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు పోచారం వెంకటేశం సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మధ్యాహ్నం ఒంటి గంటకు ఆయన కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ చెక్కులను పంపిణీ చేస్తారని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు.

కూలిన నాపరాతి గని

తాండూరు రూరల్‌: మండల పరిధిలోని మల్కాపూర్‌ శివారులో ఓ నాపరాతి గని కూలిపోయింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి నాపరాతి గనిపై ఉన్న నాపరాతిబండతో కూడిన గుట్ట ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో గనిలోకి వర్షపునీరు చేరింది. గనిలో కార్మికులు లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. దీంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

న్యాయం చేయండి

డీఎస్సీ–2008 క్వాలిఫైడ్‌ అభ్యర్థులు



మంత్రి దామోదర రాజనర్సింహతో మాట్లాడుతున్న ప్రైవేట్‌ డీఎడ్‌ అభ్యర్థులు

అనంతగిరి: డీఎస్సీ–2008 క్వాలిఫైడ్‌ అభ్యర్థులకు న్యాయం చేయాలని ప్రైవేట్‌ డీఎడ్‌ అభ్యర్థులు డిమాండ్‌ చేస్తున్నారుజ ఈ మేరకు వారు సోమవారం హైదరాబాద్‌లో వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. డీఎస్సీ–2008లో సెలక్షన్‌ లిస్టు, మెరిట్‌ లిస్టులో పేర్లు నమోదై ఒరిజినల్‌ సర్టిఫికేట్స్‌ వేరిఫికేషన్‌ చేశారన్నారు. గత ప్రభుత్వం కోర్టు ద్వారా ఆర్డర్‌ ఇచ్చి ప్రైవేట్‌ డీఎడ్‌ అభ్యర్థులకు అన్యాయం చేసిందని మంత్రికి వివరించారు. ఇచ్చిన మాటప్రకారం తమకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రఘు, కిశోర్‌, జగన్నాథ్‌ రెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చేప పిల్లల పంపిణీకి రూ.114 కోట్లు

మత్స్యకార్మిక సంఘం హర్షం



మాట్లాడుతున్న నర్సింహ

ఇబ్రహీంపట్నం: చేప పిల్లల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం రూ.114 కోట్లను కేటాయించినందుకు మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.నర్సింహ హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన ఇబ్రహీంపట్నంలోని సంఘం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మత్స్యకారులకు కేటాయించిన బడ్జెట్‌తో నాణ్యమైన మూడు అంగుళాల చేప పిల్లలను అవినీతికి తావులేకుండా పారదర్శకంగా పంపిణీ చేయాలని కోరారు. తమ సంఘం చేస్తున్న పోరాటాల ఫలితంగా ప్రభుత్వం నిధులను కేటాయించిందని, మత్స్య సొసైటీల అకౌంట్లల్లో ఈ నగదును జమ చేయాలని డిమాండ్‌ చేశారు. గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయాంలో చేప, రొయ్య పిల్లల పంపిణీలో భారీ అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు శంకర్‌, నర్సింహ, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులతో గొడవపడి..

వ్యక్తి బలవన్మరణం

షాబాద్‌: తల్లిదండ్రులతో గొడవపడిన వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన షాబాద్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని మక్తగూడలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ కాంతారెడ్డి తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన ఫిరంగి శ్రీశైలం(35) ఈ నెల 14న రాత్రి మద్యం సేవించి వచ్చి తల్లిదండ్రులతో గొడవ పడ్డాడు. ఉదయం పొలానికి వెళ్తున్నానని చెప్పిన ఆయన అక్కడే చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లే వరకు చెట్టుకు వేలాడుతూ కనిపించాడు. తల్లిదండ్రులతో గొడవపడి మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జీవాలు జాగ్రత్త



- పశువులకు సీజనల్‌ వ్యాధుల ముప్పు
- పసిరిక మేయడంతో గొంతువాపు
- ముందస్తు వ్యాక్సిన్‌ వేయించాలని వైద్యుల సలహా

దుద్యాల్‌: మానవుల మాదిరిగానే పశువుల్లోనూ సీజనల్‌ వ్యాధులు సోకే ప్రమాదం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యులు సూచిస్తున్నారు. వర్షాకాలం తొలకరి ప్రారంభమైన నేపథ్యంలో బీడు భూముల్లో పచ్చిగడ్డి పెరుగుతుంది. ఈ గడ్డిని పశువులకు రుచికరంగా ఉండడంతో ఇష్టంగా మేస్తాయి. ఈ గడ్డిలో బాక్టీరియాలు ఉండే అవకాశం ఎక్కువ. ఈ గడ్డి మేడయంతో పశువులు, మేకలు, గొర్రెలు మేయడంతో వాటి ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. ఈ బాక్టీరియాతో పచ్చిగడ్డిని మేయడంతో గొంతువాపు వ్యాధి సోకే ప్రమాదం ఉందని పశువైద్యులు తెలుపుతున్నారు. వర్షాల కారణంగా ఎక్కడ చూసిన పచ్చగడ్డి ఎక్కువగా మొలకెత్తింది. ఈ పసిరిక మేతతో బాక్టీరియా కారణంగా గొంతువాపు వ్యాధి సంక్రమించే అవకాశం ఉంది. ఈ వ్యాధి తీవ్రత ఎక్కువైతే పశువులు మృత్యువాత పడే ప్రమాదం ఉంటుంది. గొంతువాపు వ్యాధి సోకిన పశువులకు 104 కంటే ఎక్కువ డిగ్రీల జ్వరం ఉంటుందని, నిర్లక్ష్యం వహిస్తే వారంలోపే మృత్యువాత పడే అవకాశం ఉందని పశువైద్యులు తెలియజేస్తున్నారు.

పశు వివరాలు	
ఆవులు	3,785
గేదెలు	3,486
గొర్రెలు	3,774
మేకలు	7,155

వ్యాక్సినేషన్‌తో మేలు



పశువులకు, జీవాలకు సీజనల్‌ వ్యాధులు సోకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వ్యాధి సోకిన పశువులు అధికంగా జ్వరంతో సొమ్మసిల్లినట్లు ఉంటాయి. నడకలో, మేత మేయడంలో నిర్లక్ష్యంగా ఉంటాయి. వాటిని గుర్తించి పశువైద్యులను సంప్రదించాలి. లేదంటే పశువుల ప్రాణాలకే ప్రమాదం. గొంతువాపు వ్యాధి నివారణకు సంబంధించిన టీకా వేయించుకుంటే మంచిది.

– డాక్టర్‌ రియాజ్‌ హమ్మద్‌, ఇన్‌చార్జి పశువైద్యుడు, దుద్యాల్‌

నోటీసులు వెనక్కి తీసుకోవాలి



అడిషనల్‌ కలెక్టర్‌ భూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎంసీపీఐ(యూ) నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్‌: శేరిలింగంపల్లి మండలం మియాపూర్‌ పరిధిలోని ముజఫర్‌ అహ్మద్‌ నగర్‌లో ప్రజలకు ఇచ్చిన నోటీసులు వెనక్కి తీసుకోవాలని ఎంసీపీఐ(యూ) నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం వారు జిల్లా అడిషనల్‌ కలెక్టర్‌ భూపాల్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. మియాపూర్‌ సర్వే నంబరు 100లో 35 ఏళ్లుగా నివసిస్తున్న వారికి హెచ్‌ఎండీఏ అధికారులు ఇచ్చిన నోటీసులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. విద్యుత్‌ బిల్లులు, నల్లా బిల్లులు చెల్లిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంసీపీఐ(యూ) గ్రేటర్‌ హైదరాబాద్‌ కార్యదర్శి వర్గ సభ్యులు కుంభం సుకన్య, తాండ్ర కళావతి, పల్లె మురళి, అంగడి పుష్ప, తుకారాం నాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి కల్పించండి

ఆమనగల్లు: నిరుద్యోగ గిరిజన యువతకు స్వయం ఉపాధి కల్పనకు రుణాలు ఇవ్వాలని ఎస్టీ కార్పొరేషన్‌ చైర్మన్‌ బెల్లయ్య నాయక్‌ను కాంగ్రెస్‌ ఎస్టీ సెల్‌ జిల్లా నాయకులు మేడిగడ్డ రవీందర్‌ నాయక్‌ కోరారు. సోమవారం వారు నగరంలోని ఎస్టీ కార్పొరేషన్‌ కార్యాలయంలో తేజావత్‌ బెల్లయ్యనాయక్‌ను కలిశారు. ఇటీవలే ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించినందున ఘనంగా సన్మానించారు. అనంతరం తండాల్లో సమస్యలు చేపట్టాల్సిన కార్యక్రమాలపై చైర్మన్‌తో చర్చించారు. తండాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. స్వయం ఉపాధి నిమిత్తం విరివిగా రుణాలు మంజూరు చేయాలన్నారు. గిరిజన రైతుల వ్యవసాయానికి సాయం అందిచాన్నారు. సొంతిళ్లు లేని గిరిజనులకు పక్కా ఇళ్లు నిర్మించి ఆదుకోవాలన్నారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణనాయక్‌, సురేశ్‌నాయక్‌, దశరథ్‌నాయక్‌, రాములునాయక్‌, శ్రీనునాయక్‌ తదితరులు పాల్గొన్నారు.



గిరిజన నాయకులతో సమావేశమైన ఎస్టీ కార్పొరేషన్‌ చైర్మన్‌ బెల్లయ్యనాయక్‌

రికార్డు స్థాయిలో తైబజార్‌ వేలం

రూ.15.50లక్షలకు సొంతం చేసుకున్న శోభ

శంకర్‌పల్లి: మున్సిపాలిటీలో తైబజార్‌కు వేలం నిర్వహించగా రూ.15.50లక్షల రికార్డు ధరకు ఓ మహిళ సొంతం చేసుకుంది. సోమవారం మున్సిపల్‌ కార్యాలయంలో 2024–25 సంవత్సరంలో ఎనిమిది నెలల కాలానికి చైర్‌పర్సన్‌ విజయలక్ష్మి ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. ఈ వేలంలో నలుగురు పోటీ పడగా శోభాపెంటరాజ్‌ రూ.15.50లక్షలకు దక్కించుకున్నారు. గతేడాది 12నెలల కాలానికి రూ.పదిలక్షలే పలికిన తైబజార్‌ ఈ ఏడాది ఏకంగా రూ.5.50లక్షలు ఎక్కుగా పోవడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. తైబజార్‌ను దక్కించుకు శోభాపెంటరాజ్‌ దంపతులను చైర్‌పర్సన్‌ విజయలక్ష్మి, వైస్‌ చైర్మన్‌ వెంకట్రామ్‌రెడ్డి, కమిషనర్‌ శ్రీనివాస్‌, సిబ్బంది అంజన్‌కుమార్‌, జయరాజ్‌ తదితరులు పాల్గొన్నారు.



శోభాపెంటరాజ్‌ దంపతులను సన్మానిస్తున్న విజయలక్ష్మి, వెంకట్రాంరెడ్డి, శ్రీనివాస్‌

చికెన్‌ వ్యర్థాలకు సైతం..

చికెన్‌ వ్యర్థాల మూడేళ్ల(2024–2027) తరలింపునకు గాను సోమవారం వేలం నిర్వహించారు. ఇద్దరు పోటీపడగా గౌస్‌ అనే వ్యక్తి రూ.3.90లక్షలకు వేలం సొంతం చేసుకున్నారు.

రేపు దివ్యాంగులకు పరికరాల పంపిణీ

బొంరాస్‌పేట: కమిట్‌మెంట్స్‌, ఆపర్చునిటీ ఇంటర్‌నేషనల్‌ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 16, 17 తేదీల్లో దివ్యాంగులకు పరికాల పంపిణీ కార్యక్రమం ఉంటుందని కమిట్‌మెంట్స్‌ సంస్థ(ఐకేపీ) సీఆర్‌పీ శిరీష సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి బొంరాస్‌పేట మండలంలోని ఎంపిక చేసిన దివ్యాంగులకు పరికరాలు మంజూరయ్యాయని వారికి నియోజకవర్గ పరిధిలోని కోస్గి పట్టణం ఏబీకే ఫంక్షన్‌హాలులో పంపిణీ ఉంటుదన్నారు.

ఎంసీహెచ్‌లో నవజాత శిశువు మృతి

వైద్యుల నిర్లక్ష్యమేనని తల్లిదండ్రుల ఆరోపణ

తాండూరు టౌన్‌: తాండూరు మాతాశిశు ఆస్పత్రిలో ఓ నవజాత శిశువు మృతి చెందింది. ఈ ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. బొంరాస్‌పేట మండలం రేగడిమైలారం గ్రామానికి చెందిన శివకుమార్‌ తన భార్య కవితను డెలివరీ కోసం మాతా శిశు ఆస్పత్రికి తీసుకువచ్చాడు. సాయంత్రం సాధారణ కాన్పుతో ఆమె మగ శిశువుకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని చెప్పిన వైద్యులు రాత్రి 9గంటల ప్రాంతంలో శివువు మృతి చెందినట్లు చెప్పారు. దీంతో కవిత భర్త, బంధువులు వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే శిశువు మృతి చెందినట్లు ఆరోపించారు. ఇదే విషయమై ఆస్పత్రి ఆర్‌ఎంఓ డాక్టర్‌ అనిల్‌ను వివరణ కోరగా.. శిశువు పుట్టగానే శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారిందని వైద్యులు శ్రమించినా ఫలితం దక్కలేదన్నారు. ఇందులో వైద్యుల తప్పిదమేమీ లేదన్నారు.

'మధ్యాహ్న భోజనాన్ని' అక్షయపాత్రకు ఇవ్వొద్దు

ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి జైపాల్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్‌: మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్రకు ఇవ్వాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి డిమాండ్‌చేశారు. ఈ మేరకు సోమవారం మధ్యాహ్న భోజనం కార్మికులతో కలిసి అడిషనల్‌ కలెక్టర్‌ భూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి జైపాల్‌రెడ్డి, అధ్యక్షుడు రామస్వామి.. మాట్లాడతూ అక్షయపాత్రకు ఇస్తే 23 ఏళ్లుగా పని చేస్తున్న కార్మికులు రోడ్డున పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే పెండింగ్‌ బిల్లులు ఇవ్వకున్నా, సరైన వేతనాలు ఇవ్వకున్నా పని చేస్తున్నారని గుర్తు చేశారు.

ఇదేమి మెలిక?

- రేషన్‌కార్డు ఉన్నవారికే పంట రుణ మాఫీ
- మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం
- రేషన్‌ కార్డులు లేని రైతుల్లో ఆందోళన
- షరతులు లేకుండా వర్తింపచేయాలని విజ్ఞప్తి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: పంట రుణ మాఫీపై ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఎన్నికల ప్రచారంలో భాగంగా రైతులందరికీ పంట రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చి.. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత తెల్లరేషన్‌ కార్డు కలిగిన రైతులకే మాఫీ చేయనున్నట్లు ప్రకటించడంతో ఇప్పటికే వివిధ బ్యాంకుల్లో రుణాలు పొందిన జిల్లా రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆగస్టు 15లోగా రూ.2 లక్షలలోపు పంట రుణాలు మాఫీ చేస్తామని లోక్‌సభ ఎన్నికల సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టత ఇచ్చారు. పోలింగ్‌ ముగిసిన తరుణంలో సోమవారం ప్రభుత్వం రుణ మాఫీకి సబంధించి మార్గదర్శకాలు జారీ చేసింది. అర్హత కలిగిన రైతుల జాబితాను సిద్ధం చేయాల్సిందిగా ఆయా బ్యాంకులకు ఆదేశాలు జారీ చేసింది.

ప్రకటనలకు విరుద్ధంగా ..

జిల్లా వ్యాప్తంగా 3.34 లక్షల మంది రైతులు ఉన్నారు. 5.54 వేల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. వీరిలో 2.50 లక్షల మంది రూ.4,909 కోట్లు పంట రుణాలు తీసుకున్నట్లు అధికారుల అంచనా. వివిధ బ్యాంకుల నుంచి పంట రుణాలు తీసుకున్న రైతుల్లో 40 శాతం మందికి రేషన్‌కార్డులు లేవు. ఉన్న వారిలోనూ ఇంట్లో ఒక్కరికే ఈ పథకాన్ని వర్తింపజేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. మెజార్టీ రైతులు తమ భూములను ఒకే వ్యక్తి పేరున కాకుండా కుటుంబ సభ్యులందరి పేరున రిజిస్ట్రేషన్లు చేశారు. తమ పేరున భూములున్న రైతులంతా పట్టాదారు పాసుపుస్తకాలను బ్యాంకుల్లో కుదువ పెట్టి రుణాలు పొందారు. వీరిలో రైతులతో పాటు వ్యాపారులు, ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఉన్నారు. కాంగ్రెస్‌ పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా రైతులందరికీ పంట రుణాలు మాఫీ చేయనున్నట్లు ప్రకటించింది. ఆ ప్రకటనలకు విరుద్ధంగా తాజాగా మార్గదర్శకాలు జారీ చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలా ఉంటే జిల్లాలో 5,58,410 రేషన్‌కార్డులు ఉండగా, 18,22,532 మంది లబ్ధిదారులు రేషన్‌షాపుల నుంచి సరుకులు తీసుకుంటున్నారు. వీరిలో భూములు లేని వారే ఎక్కువ.

ఆందోళనలో ఆ రైతులు

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ బ్యాంకులు 370 శాఖలు ఉండగా, గ్రామీణ బ్యాంకులు 57, ప్రైవేటు బ్యాంకులు 202 వరకు (మొత్తం 629) ఉన్నాయి. వీటిలో ఎక్కువగా ప్రభుత్వ, గ్రామీణ బ్యాంకులు రైతులకు పంట రుణాలు మంజూరు చేశాయి. ఏప్రిల్‌ 2014 నుంచి 11 డిసెంబర్‌ 2018 మధ్య కాలంలో వివిధ బ్యాంకుల నుంచి పంట రుణాలు తీసుకున్న రైతుల కుటుంబాలకు గత ప్రభుత్వం కుటుంబానికి రూ.లక్ష చొప్పున వడ్డీతో కలిపి నాలుగు విడతల్లో మాఫీ చేసింది. జిల్లా వ్యాప్తంగా 1,43,278 మంది రైతులు రుణాలు తీసుకోగా వీరిలో ఇప్పటి వరకు 74,701 మంది రైతులకు రూ.420 కోట్ల రుణాలను మాఫీ చేసింది. తాజాగా కాంగ్రెస్‌ ప్రభుత్వం 12 డిసెంబర్‌ 2018 నుంచి 9 డిసెంబర్‌ 2023 మధ్య కాలం పంట రుణాలు పొందిన రైతుల అప్పులను మాఫీ చేయనున్నట్లు ప్రకటించింది. అయితే తెల్లరేషన్‌ కార్డు కలిగి ఉన్న రైతుల రుణాలను మాత్రమే రద్దు చేయనున్నట్లు స్పష్టం చేయడంతో కార్డు లేని వారు అయోమయంలో పడిపోయారు.

జిల్లాలో ఉన్న రైతులు:	3.34 లక్షల మంది
సాగులో ఉన్న పంటలు:	5.54 వేల ఎకరాలు
రుణం తీసుకున్న రైతులు:	2.50 లక్షల మంది
తీసుకున్న రుణం మొత్తం:	రూ.4,909 కోట్లు
రేషన్‌ కార్డు లేని అన్నదాతలు:	40 శాతం మంది

రైతులకు శాపం

పంట రుణాల మాఫీ కోసం ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు రైతులకు శాపంగా మారాయి. అధికారమే లక్ష్యంగా అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్‌ ప్రభుత్వం తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత రుణమాఫీ పేరుతో రైతులను మరోసారి మోసం చేస్తోంది. గత ప్రభుత్వం పదేళ్లుగా కొత్త రేషన్‌ కార్డులను జారీ చేయకుండా జాప్యం చేసింది. కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం కూడా అదే బాటలో కొనసాగుతోంది. రుణమాఫీకి రేషన్‌ కార్డుని తప్పనిసరిగా చేయడం దుర్మార్గం. రేషన్‌ కార్డు ప్రామాణికం కాదని గతంలో చెప్పిన రేవంత్‌రెడ్డి తాజాగా మోసపూరిత మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ మార్గదర్శకాలను వెంటనే సవరించి, ఎలాంటి షరతులు లేకుండా రుణ మాఫీ చేయాలి. లేదంటే రైతులతో కలిసి ఆందోళనకు దిగుతాం.

– నర్సింహారెడ్డి, బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు

కౌలు వేలం మళ్లీ వాయిదా

- తక్కువ మంది వచ్చారంటూ వాయిదా వేస్తున్నట్లు ప్రకటనలు
- ఇప్పటికే మూడు సార్లు నిరాశతో వెనుదిరిగిన రైతులు
- ఈ నెల 26న వేలం



ఆలయ భూముల కౌలు వేలానికి హాజరైన అధికారులు

దోమ: ఆలయ భూముల కౌలు వేలం మరోమారు వాయిదా పడింది. సోమవారం ఈఓ సుధాకర్‌, దేవాదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ సంజీవ స్వామి ఆలయ భూముల కౌలు వేలం ఈ నెల 26కు వాయిదా వేస్తూ ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే మూడు సార్లు నిర్వహించగా.. రైతులు తక్కువగా రావడంతో మరో మారు వాయిదా పడింది. దీంతో వేలానికి హాజరైన రైతులు అసహనంతో వెనుదిరిగారు.

కేవలం 46 ఎకరాలకే..

మండల పరిధిలోని దొంగ ఎన్కేపల్లిలోని శ్రీ సంజీవ స్వామి దేవాలయానికి 104.19 ఎకరాల భూమి ఉంది. అధికారులు భూమి మొత్తాన్ని కౌలు వేయాల్సి ఉండగా.. కేవలం గూడూర్‌ పరిధిలోని సర్వేనంబర్‌ 66, 135, 173, 174లో 46.03 ఎకరాల భూమికి మాత్రమే వేలం వేసేందుకు కసరత్తు చేస్తున్నారు. మిగిలిన భూములను వేలం వేయకుండా ఉండేందుకు ప్రయత్నిస్తున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.

రూ.10 వేలు డిపాజిట్‌



ఆలయ భూముల కౌలు వేలంలో పాల్గొనాలంటే అధికారులు ముందే రూ.10 వేలు డిపాజిట్‌ చేయమంటున్నారు. మొదటి రోజు కౌలు వేలం నిర్వహించినప్పుడే రూ.10 ఇస్తానని చెప్పడంతో నా పేరును నమోదు చేసుకున్నారు. అప్పుడు వేలంలో పాల్గొనే అవకాశం కల్పించారు. వేలానికి తక్కువ మంది రైతులు రావడంతో వాయిదా వేశారు. ఇప్పటికే మూడు సార్లు వాయిదా పడింది. సోమవారం రమళ్లీ వాయిదా వేయడంతో నిరాశతో వచ్చేశా.

– సంజీవ్‌కుమార్‌, కౌలు రైతు, దొంగఎన్కేపల్లి

డైట్‌ చార్జీలు పెంచాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌యాదవ్‌

బంట్వారం: పెరిగిన ధరలకు అనుగుణంగా హాస్టల్‌ విద్యార్థులకు డైట్‌ చార్జీలు పెంచాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌యాదవ్‌ ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో నేటికీ పదేళ్ల క్రితం డైట్‌ చార్జీలే కొనసాగుతున్నాయని దీంతో హాస్టల్‌ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదన్నారు. హాస్టళ్లపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇన్‌చార్జిలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పలు హాస్టళ్లలో మెనూ పాటించడం లేదన్నారు. విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేటు విద్యా సంస్థలో ఫీజులను నియంత్రించడంతో పాటు బీసీ విద్యార్థులకు రిజర్వేషన్ల ప్రకారం ఉచితంగా అడ్మిషన్లు ఇవ్వాలన్నారు. పెండింగ్‌ ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలన్నారు. గురుకుల వసతి గృహాలకు పక్కా భవనాలు నిర్మించాలని ఆయన డిమాండ్‌ చేశారు. ప్రభుత్వం తక్షణమే విద్యా శాఖ మంత్రిని నియమించాలన్నారు. హాస్టల్‌ విద్యార్థుల సమస్యలను పరిష్కరించకుంటే పెద్దఎత్తున రాష్ట్ర వ్యాప్త ధర్నాకు సిద్ధమవుతామని ఆయన హెచ్చరించారు.

భోజనంలో నాణ్యత పాటించాలి

ఎంఈఓ వెంకటయ్య

పెద్దేముల్‌: మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని ఎంఈఓ వెంకటయ్య సూచించారు. సోమవారం ఆయన మండల పరిధిలోని కందనెల్లితండాతో పాటు పలు పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ నెల 12న కందనెల్లి తండా పాఠశాలలో 19 మంది విద్యార్థులు అస్వస్థతకు గురై తాండూరు ఆస్పత్రిలో చికిత్స పొందిన విషయం విదితమే. జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు ఎంఈఓ మండల పరిధిలోని పలు పాఠశాలలను సందర్శించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని.. కాచి చల్లార్చిన నీటిని ఇవ్వాలని సూచించారు. ఉదయం ఎంఈఓ, మధ్యాహ్న భోజన సమయంలో కాంప్లెక్స్‌ హెచ్‌ఎంలు పాఠశాలలను తనిఖీ చేస్తారని ఎంఈఓ ప్రధానోపాధ్యాయులకు చెప్పారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కందనెల్లి తండాలో 33 మందికిగాను 16 మంది విద్యార్థులు వచ్చారని హెచ్‌ఎం సౌజన్య చెప్పగా విద్యార్థులంతా పాఠశాలకు వచ్చేలా చూడాలని ఎంఈఓ సూచించారు. విద్యార్థులకు సమస్యలుంటే వెంటనే తమ దృష్టికి తీసురావాలన్నారు.



కందనెల్లితండా పాఠశాలతో మాట్లాడుతున్న ఎంఈఓ వెంకటయ్య

సీనియర్లకు ప్రాధాన్యం ఇవ్వండి

- పార్టీ జెండా మోసిన పాత నాయకులకే మండల అధ్యక్ష పదవి కట్టబెట్టాలి
- ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, సీనియర్‌ నేత శ్రీనివాస్‌రెడ్డికి నాయకుల విన్నపం



శ్రీనివాస్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్‌ మండల నాయకులు

యాలాల: అధికారం లేని సమయంలో పార్టీని, కార్యకర్తలను కాపాడుకుంటూ వచ్చిన వారికి పదవుల కేటాయింపుల్లో ప్రాధాన్యం ఇవ్వాలని కాంగ్రెస్‌ నాయకులు కోరారు. ఇందులో భాగంగా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నేతలు ఇప్పటికే ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి తమ అభ్యర్థనను తెలియజేశారు. గత సోమవారం సీనియర్‌ నాయకుడు, ఆర్‌బీఎల్‌ ఎండీ శ్రీనివాస్‌రెడ్డిని కలిసి విన్నవించారు. ప్రస్తుతం మండలాధ్యక్షుడిగా ఉన్న నర్సిరెడ్డిని ఇటీవల మార్కెట్‌ కమిటీ వైస్‌ చైర్మన్‌గా ఖరారు చేశారు. దీంతో మండలాధ్యక్ష పదవి కోసం నాయకులు పార్టీ పెద్దలతో సంప్రదింపులు జరుపుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కారు దిగి కాంగ్రెస్‌లో చేరిన ఓ మాజీ సర్పంచ్‌ మండలాధ్యక్ష పదవికి ప్రయత్నాలు మొదలు పెట్టడంతో పాత నేతలు అప్రమత్తమయ్యారు. సదరు మాజీ సర్పంచ్‌ తాను పార్టీ అధ్యక్షుడిగా ఉంటానని తనకు సహకరించాలని గ్రామ స్థాయి నేతలకు ఫోన్లు చేసి మాట్లాడుతుండడంతో.. ఏళ్ల నుంచి ఒకే పార్టీని నమ్ముకుని ఉన్న తమను కాదని మరొకరి బాధ్యతలు ఇస్తే సహించేది లేదంటూ భీష్మించుకున్నారు. వెంటనే ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిని కలిసి బీసీ సామాజిక వర్గానికి కేటాయిస్తే జక్కేపల్లి గ్రామానికి చెందిన కోర్వని అమృతప్పకు.. రెడ్డి సామాజిక వర్గానికి కేటాయిస్తే పగిడియాలకు చెందిన యువనాయకుడు రఘురాంరెడ్డికి లేదంటే అన్నసాగర్‌ పంచాయతీకి చెందిన సత్యనారాయణ రెడ్డికి ఇవ్వాలంటూ పట్టుపడుతున్నారు. అధ్యక్ష స్థానంతో పాటు ఇతర పదవులను సైతం పాత నాయకులకే ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. దీంతో అధ్యక్ష పదవి అంశం మండల వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. త్వరలో కేటాయించే ఈ పదవి ఎవరిని వరిస్తుందో..? ఎవరు అలకబూనుతారో..? మరి కొద్ది రోజులు వేచి చూడాల్సిందే.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

- ఇటీవలే బెయిల్‌పై విడుదలైన పోక్సో నిందితుడు
- అమ్మాయి తరపు బంధువులు వేధిస్తున్నారని ఆత్మహత్యాయత్నం

దోమ/బొంరాస్‌పేట: పోక్సో కేసులో జైలుకు వెళ్లి బెయిల్‌పై బయటకు వచ్చిన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఎస్‌ఐ ఆనంద్‌ తెలిపిన ప్రకారం.. బొంరాస్‌పేట మండలం ఏర్పుమల్ల గ్రామానికి చెందిన బోయిని రామయ్య కుమారుడు మల్లేశ్‌(35) ఓ ప్రైవేట్‌ స్కూల్‌ బస్‌ డ్రైవర్‌గా పనిచేసేవాడు. 2023 మే నెలలో దోమ మండలం అనంతరెడ్డిపల్లికి చెందిన ఓ బాలికను కిడ్నాప్‌ చేసి తీసుకెళ్లాడు. ఈ మేరకు కేసు నమోదైంది. 2024 మార్చిలో వీరి ఆచూకీ లభించింది. అప్పటికే బాలిక ఆరు నెలల గర్భం దాల్చింది. పోలీసులు బాలికను ఆస్పత్రికి తీసుకెళ్లగా అబార్షన్‌ చేస్తేనే బాలిక బతుకుతుందని వైద్యులు చెప్పారు. దీంతో మల్లేశ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. జూన్‌ 15న బెయిల్‌పై వచ్చిన యువకుడు బాలికకు ఫోన్‌ చేసేందుకు యత్నించాడు. ఈ విషయాన్ని ఆమె తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో భయాందోళనకు గురైన మల్లేశ్‌ ఇంటికెళ్లకుండా గడిపాడు. బాలిక తల్లిదండ్రులు వేధిస్తున్నారంటూ ఓ సూసైడ్‌ నోట్‌ రాసుకుని, ఈ నెల 10న పురుగు మందు తాగాడు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే పరిగి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు వికారాబాద్‌కు రెఫర్‌ చేశారు. అక్కడ పరిస్థితి విషమించడంతో నగరంలోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న మల్లేశ్‌ సోమవారం మృతి చెందడంతో ఆయన స్వగ్రామం ఏర్పుమల్లలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడి తండ్రి రామయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.